ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 26
సంచిక : 142
పేజీలు : 3
గురువారం, ఫిబ్రవరి 12, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## పోలింగ్ శాతం 73.60% నమోదు

### -జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్



**టీ మీడియా,ఫిబ్రవరి11, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్ మరియు మున్సిపాలిటీలకు సంబంధించిన 2వ సాధారణ ఎన్నికల పోలింగ్ ఈ రోజు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, అశ్వరావుపేట మరియు ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 106 వార్డులకు పోలింగ్ నిర్వహించబడింది.ఎన్నికల ప్రక్రియ మొత్తం సజావుగా కొనసాగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని ఆయన అన్నారు.జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,85,348 మంది ఓటర్లలో 1,36,423 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 73.60 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. పురుష ఓటర్లలో 73.70 శాతం, మహిళా ఓటర్లలో 73.51 శాతం, ఇతర వర్గాల్లో 78.95 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. ప్రజలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందకరమని కలెక్టర్ అన్నారు.మున్సిపాలిటీ వారీగా పరిశీలిస్తే అశ్వరావుపేట మున్సిపాలిటీలో 16,830 మంది ఓటర్లలో 12,849 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 76.28 శాతం పోలింగ్ నమోదు కాగా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,34,775 మంది ఓటర్లలో 1,00,453 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 74.53 శాతం పోలింగ్ నమోదైంది. ఇల్లందు మున్సిపాలిటీలో 33,723 మంది ఓటర్లలో 23,121 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 68.56 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిందని, పోలింగ్ ముగిసే సమయానికి కేంద్రాల వద్ద క్యూలో ఉన్న ప్రతి ఓటరికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికార యంత్రాంగం, పోలీస్ సిబ్బంది మరియు ప్రజలందరికీ జిల్లా ఎన్నికల అధికారి కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రశాంతంగా పోలింగ్

### -82.50 శాతం నమోదు


### -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**టీ మీడియా,ఫిబ్రవరి11, ఖమ్మం:** మునిసిపల్ ఎన్నికల పోలింగ్ ఖమ్మం జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి జిల్లాలో 5 మున్సిపాలిటీలలోని 116 వార్డులకు జరిగిన పోలింగ్ లో మొత్తం 82.50 శాతం ఓటింగ్ నమోదైందని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 15.37 శాతం, 11 గంటల వరకు 37.10 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకు 59.41 శాతం పోలింగ్ నమోదైందని, సాయంత్రం 3 గంటల వరకు 72.93 శాతం పోలింగ్ నమోదైందని, 5 గంటల వరకు 82.30 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని, మొత్తంగా ఖమ్మం జిల్లాలో 1,41,875 మంది ఓటర్లకు గాను 117043 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోగా, ఇందులో 55,506 మంది పురుష ఓటర్లు, 61,520 మంది మహిళా ఓటర్లు, 17 మంది ఇతరులు ఉన్నారు. మొత్తంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 82.50 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు.పోలింగ్ జరిగిన ఏదులాపురం మున్సిపాలిటీలో 85.45 శాతం, వైరా మున్సిపాలిటీలో 83.71 శాతం,సత్తుపల్లి మున్సిపాలిటీలో 77.81 శాతం,కల్లూరు మున్సిపాలిటీలో 87.08 శాతం,మధిర మున్సిపాలిటీలో 78.19 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా కలెక్టరేట్ నుంచి నిరంతరం మానిటరింగ్ చేయడం జరిగిందని అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పురపాలక ఎన్నికల్లో భాగంగా ఏదులాపురం

మిగతా 3లో






## జాయింట్ యాక్షన్ కమిటీ సమ్మె నోటీసు



**టీ మీడియా ఫిబ్రవరి 11, భూర్గంపాడు :** సారపాక లోని ఐటిసి లిమిటెడ్ పీఎస్‌పీడి భద్రాచలం యూనిట్ లోని సారపాక కాంట్రాక్ట్ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో కార్మికులు యాజమాన్యానికి సమ్మె నోటీసు జారీ చేశారు. 13వ వేతన ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోతే, 14వ వేతన ఒప్పంద చర్చల్లో కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీతో మాత్రమే చర్చలు జరపకపోతే 45 రోజుల తర్వాత ఏ క్షణమైనా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ నోటీసును ఐటిసి లిమిటెడ్ పీఎస్‌పీడి భద్రాచలం యూనిట్ హ్యూమన్ రిసోర్సెస్ జనరల్ మేనేజర్‌కు అందజేశారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947, సెక్షన్ 22 (1) నిబంధనలకు అనుగుణంగా జారీ చేసిన ఈ సమ్మె నోటీసులో జేఏసీ నాయకులు తమ డిమాండ్లను స్పష్టం చేశారు. తేదీ 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2026 వరకు కాలపరిమితితో ఉన్న 13వ వేతన ఒప్పందంలో కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన అంశాలు నేటికీ అమలు కాలేదని, ఈ ఒప్పందం 31 మార్చి 2026తో ముగుస్తుందని పేర్కొన్నారు. గతంలో తేదీలు 30 జూలై 2025, 9 సెప్టెంబర్ 2025 మరియు 5 ఫిబ్రవరి 2026లో యాజమాన్యానికి సమస్యలు తెలిపినప్పటికీ పరిష్కారం లేకపోవడం వల్ల చాలా మంది కార్మికులు నష్టపోతున్నారని ఆరోపించారు.పర్మనెంట్ కార్మికుల ఎన్నికలతో గెలిచిన గుర్తింపు సంఘం యూనియన్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతన ఒప్పందాలు చేయడం వల్ల ప్రతి సంవత్సరం నష్టాలు జరుగుతున్నాయని, ఆ ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికుల భాగస్వామ్యం లేని పరిస్థితిలో 14వ వేతన ఒప్పందాన్ని కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీతో మాత్రమే చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అయినప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతూ మొండి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో హక్కులను కాపాడుకోవడానికి జేఏసీ జనరల్ బాడీ సమావేశంలో తీర్మానం చేసి, నేటి నుంచి 45 రోజుల్లోగా డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని సూచించారు.

ఈ సంఘటన భద్రాచలం పరిసరాల్లో కార్మికులు, యాజమాన్యం మధ్య ఉద్రిక్తతను పెంచుతోంది. కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఈ యూనిట్‌లో వేతన ఒప్పందాలు, పెండింగ్ సమస్యలు పరిష్కారం కాకపోతే ఉత్పత్తి ప్రక్రియలపై ప్రభావం పడవచ్చని స్థానికులు అంచనా వేస్తున్నారు. యాజమాన్యం ఈ నోటీసుకు ఎలాంటి స్పందన ఇస్తుందో ఆసక్తికరంగా ఉంది.

ఈ కార్యక్రమంలో కన్వీనర్ పాటు సోమిరెడ్డి, కో కన్వీనర్ నాగయ్య, యాకూబ్ భాష, రామచంద్రారెడ్డి, ఉర్లగుంట వీరన్న, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 13న రవాణా శాఖ సేవలు బంద్.

**-జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్**

**టీ మీడియా,ఫిబ్రవరి11,ఖమ్మం:**ఈనెల 13న, రవాణా శాఖ సిబ్బంది వాహన్ పోర్టల్ పైశిక్షణ కొరకు నిమిత్తం హైదరాబాద్ వెళ్తున్న సందర్భంగా ఖమ్మం రవాణా శాఖ సిబ్బందిని, వైరా ఆర్టీఏ కార్యాలయంలో ఈ నెల 13న ఎటువంటి సేవలు అందుబాటులో ఉండవు,ఖమ్మం, సత్తుపల్లి ఆర్టీఏకార్యాలయంలో పాక్షికంగా సేవలు అందుబాటులో ఉంటాయి, ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్, దరఖాస్తుదారులు,కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకునేవినియోగదారులు, ఈ విషయాలను గమనించి సహకరించవలసిందిగా , ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్ కోరారు.



## అటెండర్ మృతికి తహసీల్దార్ సంతాపం

**టీ మీడియా,ఫిబ్రవరి11, మోతే:** మోతె మండల తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న కాంపాటి సాయిలు మంగళవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందడం తో బుధవారం తహసీల్దార్ యం.వెంకన్న మృతుని గ్రామం సిరిపురం వెళ్ళి సాయిలు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం సాయిలు కుటుంబ సభ్యులకు ప్రగడ సంతాపాన్ని తెలియజేశారు. సాయిలు ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. ఈ కార్యక్రమం లో డిటి పుష్ప, సీనియర్ అసిస్టెంట్ సుజిత్, జిపిఓలు రమేష్, జహంగీర్, సుధాకర్, నాగయ్య, తాసిల్దార్ కార్యాలయం స్టాఫ్ పాల్గొన్నారు.



## కోటిలింగాల జాతరకు ఏర్పాట్లు

**పరిశీలించిన ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్**

**టీ మీడియా,ఫిబ్రవరి11,సింగరేణి(కారేపల్లి):**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పోలంపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ కోటిలింగాల జాతర సందర్భంగా భక్తుల రాకపోకలు భారీగా ఉండనున్న నేపథ్యంలో అధికారులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. మండల పంచాయతీ అధికారి మల్లెల రవీందర్ ప్రసాద్, పోలంపల్లి సర్పంచ్ హేమలత ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుద్ధ్య చర్యలు, వీధి దీపాలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు.భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరం, అంబులెన్స్ సదుపాయం, అత్యవసర సహాయ కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు స్వచ్ఛంద సేవకులను నియమించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శుభ్రత బృందాలను ఏర్పాటు చేశారు. భక్తులు క్రమశిక్షణగా వ్యవహరించి అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు. జాతర విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆలెం వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి కార్యదర్శి నెహ్రూ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మృత్యుదారిగా భద్రాచలం, చర్ల రహదారి

**టీ మీడియా, ఫిబ్రవరి 11 ,దుమ్ముగూడెం :** భద్రాచలం నుంచి చర్ల ప్రధాన రహదారి మరోసారి ప్రాణాన్ని బలిగొంది. లక్ష్మీనగరం వద్ద జరిగిన బుధవారం జరిగిన ఘటనలో చర్ల మండలంలోని సుబ్బంపేట పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన కొట్టెం కమల అక్కడికక్కడే మృతి చెందింది. క్షణాల్లో జరిగిన ఈ ఘటన ఒక కుటుంబాన్ని విషాదంలో ముంచెత్తింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం కమల బైక్ పై ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా ద్విచక్ర వాహనం ములకపాడు సెంటర్ ప్రధాన రహదారి వద్ద గుంతలో స్లిప్పై ఆమె కిందపడింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న సిమెంటు లోడు లారీ అదుపులోకి రాక ఆమె పైనుంచి దూసుకెళ్లినట్లు చెబుతున్నారుతీవ్ర గాయాలపాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనను కళ్లారా చూసిన వారు షాక్కు గురయ్యారు. ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పరిస్థితులు, అధిక వేగంతో వెళ్తున్న భారీ ఇసుక లారీలు, భారీ వాహనాలు, ట్రాఫిక్ నియంత్రణ లోపాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. ఇంకెంతమంది ప్రాణాలు పోతే అధికారులు మేల్కొంటారుఅని ప్రశ్నిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిసింది. కమల మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.





## రామయ్య ని దర్శించుకున్న విజయేంద్ర ప్రసాద్

**టీ మీడియా, ఫిబ్రవరి 11, భద్రాచలం టౌన్ :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రదాన ఆలయం లోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద ఆశీర్వచనం అందించి శాలువా తో సత్కరించారు. విజయేంద్ర ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన తెలుగు సినీ రచయిత పూర్తి పేరు కోడూరి వెంకట విజయేంద్ర ప్రసాద్. సుప్రసిద్ధ దర్శకుడు ఎస్. ఎస్. రాజమౌళి ఇతని కుమారుడు. ఆయన తెలుగు, హిందీ ఇతర భాషలలో అత్యంత విజయవంతమైన కథా రచయిత. ఆయన బాహుబలి, ఆర్ ఆర్ ఆర్, బజరంగీ భాయిజాన్, మగధీర, సింహాద్రి, విక్రమార్కుడు వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. రాజన్న, శ్రీవల్లి వంటి చిత్రాలకు దర్శకత్వం కూడా వహించారు. బీజేపీ ప్రభుత్వం 2022 జులై 6 న రాజ్యసభకు నామినేట్ చేసింది.

## పాఠశాలలో తనిఖీలు

**-మధ్యాహ్న భోజనంపై సర్పంచ్ ఆదేశాలు**

**టీ మీడియా, ఫిబ్రవరి 11, భూర్గంపాడు :** ఇరవెండి ప్రాథమికొన్నత పాఠశాలను గ్రామ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు మంగళవారం తనిఖీలు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, తరగతి గదుల పరిస్థితి, హాజరు రిజిస్టర్లు, పరిశుభ్రత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన సర్పంచ్, భోజనం నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. పిల్లలకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, భోజనం శుభ్రంగా, సమయానికి వడ్డించాలని ఉపాధ్యాయులకు , వంట సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ఉప సర్పంచ్ మాట్లాడుతూ, "విద్యార్థుల ఆరోగ్యం , విద్య రెండూ ముఖ్యమైనవి. పాఠశాలలో భోజనం నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదు" అని అన్నారు. అవసరమైతే మెనూ అమలు పై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రటరీ,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## భద్రాచలం కి పాదయాత్ర

**టీ మీడియా ఫిబ్రవరి 11, భద్రాచలం టౌన్ :** కాకినాడ నుంచి భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానిపాదయాత్ర ఉత్సాహంతో జరిగింది. ఈ యాత్రను ఆధ్యాత్మిక గురువు వీర వెంకట సుబ్బారావు ఉంగరాల గురుస్వామి నేతృత్వంలో సుమారు 350 మంది భక్త జట్టు చేపట్టింది. కాకినాడలో 06న ప్రారంభమైన ఈ యాత్ర 11 సాయంత్రం భద్రాచలం చేరుకున్నారు.




## విధి నిర్వహణలో అలసత్వం వద్దు

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామారావు**

**టీ మీడియా, ఫిబ్రవరి 11, కామేపల్లి:** విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించరాదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామారావు సిబ్బందికి సూచించారు. బుధవారం కామేపల్లి మండల కేంద్రం ఆరోగ్య కేంద్రం, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అటెండెన్స్ రిజిస్టర్తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని, రోగులకు ఓర్పుతో వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు.అనంతరం ఎంసీహెచ్లో నిర్వహిస్తున్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్, న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్లను తనిఖీ చేశారు. పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లలకు తగిన పోషకాహారం అందించాలన్నారు. ఆసుపత్రిలోని ఇన్పేషెంట్ వార్డులు, ల్యాబ్, మందుల నిల్వ గదులను పరిశీలించారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసేలా వారికి ఆరోగ్య పరమైన కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. వైద్యం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని, విధులను సక్రమంగా నిర్వర్తించని ఎడల శాఖాపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హెచ్ ఓ కే వెంకటేశ్వర్లు, పల్లె దవాఖాన మెడికల్ ఆఫీసర్ తనుషా, సూపర్వైజర్ రాధాకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ పుష్పలత, హెల్త్ అసిస్టెంట్ తిరుమలయ్య, శ్రీనివాస్, ఏఎన్ఎం రమణ, ఉష ఎల్టి ఉమామహేశ్వరరావు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నా రు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోలింగ్

**అశ్వారావుపేట 76.20, కొత్తగూడెం 74.19, ఇల్లందు 68.44 శాతం**

**టీ మీడియా,ఫిబ్రవరి11, భద్రాద్రి కొత్తగూడెం** :చెదురుమదురు ఘటనలు మినహా అశ్వారావుపేట మున్సిపల్ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మూడు పురపాలక సంఘాల పోలింగ్ లో అశ్వారావుపేటలోనే అధికంగా నమోదు అయింది. అశ్వారావుపేట 76.20, కొత్తగూడెం 74.19, ఇల్లందు 68.44 శాతం నమోదు అయింది. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో 35 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లు 16850 గానూ 12839 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.76.29 శాతం పోలింగ్ నమోదు అయింది. ఇందులో 4 వ వార్డు లో 679 మంది ఓటర్లు కు గానూ 608 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ వార్డులో అత్యధికంగా 89.54 శాతం పోలింగ్ నమోదైంది. 12 వ వార్డు లో 732 ఓటర్లు కు గానూ 461 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ వార్డులో అత్యల్పంగా 62.97 శాతం పోలింగ్ నమోదైంది.అశ్వారావుపేట మున్సిపాలిటీ పోలింగ్ లో చిన్నపాటి గందరగోళం నెలకొంది.ఏ ఎస్ ఆర్ నగర్ లోని ఓ పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా లో తీవ్ర అంతరాయం ఏర్పడింది.మొత్తం 35 పోలింగ్ కేంద్రాలు ఉండగా 10 మాత్రమే చక్రాల కుర్చీ లు(వీల్ చైర్లు) ఏర్పాటు చేయడం తో వృద్ధులు, వికలాంగుల ఇబ్బంది కి గురయ్యారు. 14 వ వార్డు లోని పోలింగ్ కేంద్రంలోకి ఓటు వేయడానికి వెళ్లిన మహిళకు ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ పేపర్ ఇచ్చి కాంగ్రెస్ కు ఓటేయాలని పోలింగ్ బూత్ లోనే ఎన్నికల ప్రచారం చేస్తున్నారని ఓటరు బయటకు వచ్చి ఆందోళన చేపట్టారు. 9 వ వార్డు లోని 12 వ పోలింగ్ బూత్ లో ఓ మహిళ ఓటు వేయటానికి వెళితే నీ ఓటు వేసేసావు అంటూ ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యంగా చెప్పటం,మహిళా ఓటర్ భర్త వచ్చి నిలదీసి అడగడంతో ఎంట్రీ లో తేడా పడిందని ఎన్నికల సిబ్బంది నాలుక కరుచుకొని ఓటు వేయించటం వంటి ఘటన చోటు చేసుకుంది.20 వ వార్డు పోలింగ్ కేంద్రం ఎదురుగా అభ్యర్థి గృహం ఉండటంతో పోలింగ్ కేంద్రం ముందు కూర్చుని ఎన్నికల ప్రచారం చేస్తున్నారంటూ ప్రత్యర్థి అనుచరులు నెత్తీనోరు బాదుకున్నా పోలీసులు గాని ఎన్నికల సిబ్బంది గాని మున్సిపల్ సిబ్బంది గాని అటువైపు చూడటం లేదు అనే ఆరోపణలు



ఉన్నాయి.అసెంబ్లీ మాదిరిగా హోమ్ ఓటింగ్ ఇవ్వకపోవడంపై ఎన్నికల కమిషన్ పై తీవ్రంగా విమర్శలు వస్తున్నాయి. 14 వ వార్డు కి చెందిన బుక్కూరీ పార్వతీ అనే వృద్ధురాలు ప్రమాదానికి గురై కాలు కు తీవ్రగాయాలతో హాస్పిటల్ లో చికిత్స పొందుతూ నేరుగా అంబులెన్స్ లో పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి కుటుంబ సభ్యులు తీసుకుని వచ్చారు.



## ఉపాధి కూలీలకు పలుగు, పారా పంపిణీ

**టీ మీడియా,ఫిబ్రవరి11, టేకులపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలోని టేకులపల్లి పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పలుగు, పార, బొచ్చలు సర్పంచ్ బోడ బాలు నాయక్ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. టేకులపల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కార్మికులలో 30 గ్రూపులకు 30 గడ్డ పారలు, 60 పారలు, 90 బొచ్చలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి, ఉప సర్పంచ్ వసంత, వార్డు సభ్యులు జీజ, సుజాత, రామకృష్ణ, కిరణ్, గణేష్, ఉషా, కోక, కోటేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.



## సజావుగా ఏదులాపురం పోలింగ్

**-85.35% నమోదు**

**టీ మీడియా,ఫిబ్రవరి11, ఖమ్మం రూరల్ :** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో జరిగిన ఓటింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 32 వార్డులకు గాను ఒక వార్డు ఏకగ్రీవం కావడంతో 31 వార్డులకు బుధవారం పోలింగ్ జరిగింది. 31 వార్డుల పరిధిలో మొత్తం 43,811 మంది ఓటర్లు ఉండగా వారిలో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి గాను 37,391 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 177 మంది కాగా మహిళా ఓటర్లు 1,962 మంది ఉన్నారు. మొత్తం మున్సిపాలిటీ పరిధిలో 85.35% పోలింగ్ నమోదైనట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు.వార్డు నెంబర్ 20 పరిధిలోని 44వ పోలింగ్ కేంద్రంలో 96.3% పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా 22వ వార్డు 47వ పోలింగ్ కేంద్రంలో 66.98% పోలింగ్ నమోదు జరిగింది. ఈ నెల 13వ తేదీన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శి మహిళా కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు భారీ బందోబస్తు చేపట్టడంతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.



## కంపచెట్లను తొలగించిన సర్పంచ్

**టీ మీడియా ఫిబ్రవరి 11 కామేపల్లి**కామేపల్లి మండల పరిధిలోని సాతాని గూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రెడ్యా సాతానిగూడెం స్టేజ్ రోడ్ నుంచి గ్రామం చివరి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను జెసిబి ద్వారా చెట్లను బుధవారం నాడు తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రెడ్యా మాట్లాడుతూ.. చాలా రోజుల నుండి సాతానిగూడెం ప్రజలు రోడ్డుకు అడ్డంగా పెరిగిన కంపచెట్లతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారని, వారి ఇబ్బందులను తొలగించేందుకు కంప చెట్లను తొలగించినట్లు తెలిపారు. కంపచెట్లను తొలగించినందుకు గాను గ్రామ ప్రజలు సర్పంచ్ ను అభినందించారు.

## పార్థివ దేహానికి నివాళులు



**టీ మీడియా. ఫిబ్రవరి 11. తిరుమలాయపాలెం** ;మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన కావిటి మంగమ్మ 80 సంవత్సరాలు గత కొంతకాలం నుండి అనారోగ్యంతో బుధవారం ఆమె స్వగృహంలో మృతి చెందగా మృతి వార్త తెలుసుకున్న పిండిప్రోలు యాదవ సంఘం అధ్యక్షులు దొడ్డ గురవయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ చల్ల వెంకటేశ్వర్లు ,బండి వీరయ్య , దొడ్డ లింగస్వామి మృతురాలు కావిటి మంగమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి మృతురాలి కుటుంబ సభ్యులకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.



## సీసీఐ కేంద్రం పై విచారణ

**అడ్డుకుంటున్నారని ఆరోపణలు**

**టీ మీడియా,ఫిబ్రవరి11,ఖమ్మం రూరల్** :రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరిగాయి అంటూ వచ్చిన ఆరోపణల పై మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విధితమే. అయితే అదే సందర్భంలో ఆయన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 137 కొనుగోలు కేంద్రాల్లో ఈ విచారణ జరపాలని, ఒకవేళ అవకతవకలు జరిగాయని నిర్ధారణ అయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుఅయినా మంత్రి మాటను లెక్కచేయని కొంతమంది మార్కెటింగ్ శాఖ అధికారులు తమ స్వార్ధాల కోసం అవకతవకలకు పాల్పడిన కేంద్రాల పై విచారణ జరక్కుండా అడ్డుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం రూరల్ ప్రాంతంలోని పొన్నెకల్లులో గల ఒక ప్రముఖ వ్యాపారికి చెందిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని విచారణ జాబితాలోకి రాకుండా పక్కన పెట్టినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనాప్పటికీ అవకతవకలకు పాల్పడిన కేంద్రాలను వాటిలో జరిగిన అక్రమాలను బయటికి తీయాల్సిన అధికారులే అడ్డుకోవడం పై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మద్దులపల్లిలోని ఓ అధికారి రాష్ట్రస్థాయిలో గల అధికారి సహకారంతో పొన్నెకల్లు కొనుగోలు కేంద్రం పై విచారణ జరగకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలు వినబడుతున్నాయి.

## ప్రశాంతంగా పోలింగ్

మున్సిపాలిటీ పరిధి జలగం నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంను తనిఖీ చేసి ఓటింగ్ సరళిని పరిశీలించి, పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు కల్పించిన వసతులను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎన్నికల సాధారణ పరిశీలకులు పవన్ కుమార్ కలెక్టరేట్ లోని వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ ను పరిశీలించారు.వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ లో డిఆర్ఓ పద్మశ్రీ, సిపిఒ శ్రీనివాస్, టెక్నికల్ మేనేజర్ హనుమా చారి, ఈడిఎం దుర్గాప్రసాద్, టెక్నికల్ టీం సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.




## భద్రగిరిలో అంతర్రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు

**బ్రోచర్ని ఆవిష్కరించిన**

**భద్రాద్రి కళాభారతి నిర్వాహకులు**

**టీ మీడియా,ఫిబ్రవరి11, భద్రాచలం**

ఈనెల 20, 21, 22 తేదీలలో భద్రాద్రి కళాభారతి 24వ అంతర్రాష్ట్రస్థాయి నాటకోత్సవ సాంస్కృతిక సంబరాలను ఘనంగా నిర్వహించనున్నామని భద్రాచలం పట్టణ ప్రముఖులు ఐటిసి పిఎస్పిడి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం తాలూరి పంచాక్షరితో కలిసి అంతర్ రాష్ట్ర నాటుకోత్సవ బ్రోచర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భద్రగిరి చరిత్రలోనే భద్రాద్రి కళాభారతి నిర్వహిస్తున్న నాటకోత్సవాలు ప్రత్యేకతను చాటుతున్నాయని ఆయన అన్నారు. పంచాక్షరయ్య భారతీదేవి కళావేదికపై నిర్వహించనున్న ఈ నాటకోత్సవాలకు ఎటువంటి టిక్కెట్ రుసుములు లేవని అందరికీ ఉచిత ప్రవేశమే కల్పిస్తున్నామని తెలిపారు. ఈ నాటకోత్సవానికి ప్రముఖ గాయకులు, కళాకారులు, సినీ కళాకారులు హాజరుకానున్నారని తెలిపారు. కళా ప్రేమికులు పుర ప్రముఖులు అభ్యుదయ భావవాదులు ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో దామోదరావు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వెంకటాచారి, తాళ్లపూడి రాము, తదితరులు పాల్గొన్నారు.